
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి





చెన్నూరు డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది

నేడు పోలింగ్

- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- కేంద్రాలకు సామగ్రి తరలించిన సిబ్బంది
- పటిష్ట బందోబస్తు మధ్య పార్లమెంట్ ఎన్నికలు
- ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు
- స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచన
- జిల్లాలో 6 లక్షల పై చిలుకు ఓటర్లు

మంచిర్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నిర్వహించే లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. పెద్దపల్లి పార్లమెం ట్ స్థానానికి సంబంధించి మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో మొత్తం 741 బూత్‌లను ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంత పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేయగా, సరిహద్దు రాష్ట్రాల ప్రాణహిత పరివాహక ప్రాంతాల్లో డ్రోన్ పెట్రోలింగ్ యూనిట్ ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేశారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళి, నియమ నిబంధనలు ఉల్లంఘించడంతోపాటు ఎన్నికల ప్రక్రియకు భంగం కలిగించేవారిపై కఠినంగా వ్యవహరించనున్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఆదివారం పరిశీలించారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలింగ్ బందోబస్తు, భద్రత కోసం 3300 మంది పోలీస్ బలగాలను ఏర్పాటు చేశారు. 832 సివిల్ ఫోర్స్, 384 వింగ్ ఫోర్స్, 300 మంది హోంగార్డ్స్, 300 మంది శిక్షణ కానిస్టేబుళ్లు, 700 మంది చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన హోం గార్డులు, 64 మంది స్పెషల్ పార్టీ సిబ్బందితో పాటు ఎన్‌సీసీ కెడేట్లు, 443 మంది ఐదు కంపెనీలకు చెందిన కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

త్రిముఖ పోటీ..

పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి ముఖ్యంగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌ల తరుపున గడ్డం వంశీకృష్ణ, శ్రీనివాస్ గొమాసే, కొప్పుల ఈశ్వర్‌లు పోటీ పడుతున్నారు. ఎన్నికల్లో పోటీ ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్యనే నెలకొంది. మూడు పార్టీల నుంచి హేమా హేమీలు తలపడుతుండడంతో ఓటర్ల మద్దతు ఎవరికి లభిస్తుందోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ కుటుంబానికి పెద్ద రాజకీయ చరిత్రే ఉండగా, ప్రత్యక్ష ఎన్నికల బరిలో మొదటి సారి దిగుతున్న ఆయన తన రాజకీయ భవిష్యత్తును పరీక్షించుకోనున్నారు. బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేకు సీనియర్ నాయకుడిగా పేరుంది. 2009లో ఆయన కాంగ్రెస్ టికెట్‌పై పెద్దపల్లి పా ర్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు రాజకీయానుభవం మెండుగా ఉంది. గతంలో ఆయన పలుమార్లు మేడారం నియోజక వర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందగా, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా పని చేశారు. కాగా ఓటర్ల మద్దతు పై ముగ్గురు అభ్యర్థుల్లో ఎవరికి ఉంటుం దోనన్న చర్చ జోరుగా సాగుతోంది.

మూడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో..

పెద్దపల్లి లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మంచిర్యాల జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో మొత్తం 6 లక్షల పై చిలుకు ఓటర్లు ఉన్నారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 6,49,905 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 105 మంది ఎన్‌ఆర్‌ఐలు, మరో 1462 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. కాగా చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 1,94,064 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 96,019 మంది ఉండగా, స్త్రీలు 97,752, ఇతరులు 7గురు ఉన్నారు. అలాగే ఎన్‌ఆర్‌ఐ ఓట్లు 8 ఉం డగా మొత్తం పురుషులే ఉన్నారు. సర్వీసు ఓటర్లు 140 మంది ఉండగా పురుషులు 138 మంది, స్త్రీలు 2 ఉన్నారు. బెల్లంపల్లి నియోజక వర్గంలో 1,76,688 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 87,283 మంది, స్త్రీలు 89,219, ఇతరులు 12 మంది ఉన్నారు. ఎన్‌ఆర్‌ఐ పురుషులు 2 ఉన్నారు. సర్వీసు ఓటర్లు 172 మందిలో పురుషులు 163, స్త్రీలు 9 మంది ఉన్నా రు. మంచిర్యాల నియోజక వర్గంలో 2,79,153 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,38,064, స్త్రీలు 1,40,648 మంది, ఇతరులు 26 మంది ఉన్నారు. ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు 28 మంది ఉండగా, పురుషులు 22, స్త్రీలు 6గురు ఉన్నారు. సర్వీసు ఓటర్లలో 365 మందికిగాను పురుషులు 355, స్త్రీలు 10 మంది ఉన్నారు.

చెన్నూరు: పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఆదివారం కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని డీసీపీ అశోక్ కుమార్, చెన్నూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి చంద్ర కళతో కలిసి ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అందజేశారు. నియోజకవర్గంలో 227 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు గాను 272 పీవోలు, 272 మంది ఏపీవోలు, 544 ఓపీవోలు ఉండగా ,మొత్తంగా 28 రూట్ లను ఏర్పాటు చేయగా, 28 మంది జోనల్ అధికారులు, 30 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి చంద్రకళ తెలిపారు.

మందమర్రిటౌన్: మందమర్రి పట్టణంలో పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పించారు.

కాసిపేట: బెల్లంపల్లి నియోజకవర్గంలో ఐదు మహిళ పోలింగ్ కేంద్రాలు, మరో ఐదు మోడల్ పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేశారు. వీటితో పాటు ఒకటి యూత్, మరొకటి దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాలను గుర్తించి అన్ని సౌకార్యలతో ముస్తాబు చేశారు. మహిళ పోలింగ్ కేంద్రా ల్లో మహిళా సిబ్బందే విధులు నిర్వహిస్తారు.

వేమనపల్లి: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రితో చేరుకున్నారు. సిబ్బందికి సెక్టార్ అధికారులు బాపురావు, గిరిధర్‌రెడ్డి, నరేష్‌లు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

హాజీపూర్: మండలంలోని అన్ని గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఆదివారం సాయంత్రం పోలింగ్ అధికారులు ఎన్నికల సామగ్రితో చేరు కున్నారు. వీరికి పంచాయతీ సిబ్బంది, బీఎల్‌వోలు స్వాగతం పలికారు. ఎన్నికల ప్రి సైడింగ్ అధికారి శంకర్, ఎస్ఐ సురేష్, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: లోకసభ ఎన్నికలకు దండేపల్లి మండలంలో ఆయాగ్రా మాలోని ఆదివారం రాత్రి వరకు అంతా సిద్ధం చేసినట్లు దండేపల్లి తహసీల్దార్ సంధ్యరాణి అన్నారు. ఆదివారం సాయంత్రం మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి ఎన్నికల అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

భీమారం: మండలంలో పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండల వ్యాప్తంగా భీమారం, మద్దికల్, ఖాజీపల్లిలను మూడు సెక్టార్లుగా విభజించి ముగ్గురు సెక్టార్ అధికారులు, రూట్ ఆఫీసర్లను నియమించారు. మండలంలో మొత్తం 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 70 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. ఆదివారం సాయంత్రం ఎన్నికల సామ గ్రితో సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలో 12,846 మంది ఓటర్లు ఉన్నారు.

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

మంచిర్యాల కలెక్టరేట్: లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను డీసీపీ అశోక్‌కుమార్, ఆర్డీవో రాములు, ఏసీపీ ప్రకాష్‌తడ కలిసి సందర్శించి ఎన్నికల సిబ్బందికి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. చెన్నూరు సెగ్మెంట్‌లో 227 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి 227 మంది ప్రిసైడింగ్, 272 మంది సహాయ ప్రిసైడింగ్, 544 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులు, 30 మంది సూక్ష్మ పరిశీలకులు ,28 మంది సెక్టార్ అధికారులను నియమించామని తెలిపారు. బెల్లంపల్లి సెగ్మెంట్‌లో 227 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి 227 మంది ప్రిసైడింగ్, 272 మంది ,272 మంది సహాయ ప్రిసిఐడింగ్, 544 ఇతర ప్రిసైడింగ్ అధికారులు, 33 మంది సూక్ష్మ పరిశీలకులు, 30 మంది సెక్టార్ అధికారులను నియమించినట్లు వివరించారు. మంచిర్యాల సెగ్మెంట్‌లో 287 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి 344 ప్రిసైడింగ్, 344 మంది సహాయ ప్రిసైడింగ్, 688 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులు, 32 మంది సూక్ష్మ పరిశీలకులు, 30 మంది సెక్టార్ అధికారులను నియమించామని తెలిపారు.

బెల్లంపల్లి: జిల్లాలో సోమవారం నిర్వహంచే పార్లమెంట్ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్, రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. తిలక్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్‌తో కలిసి పరిశీలించారు.



పోలింగ్ సిబ్బందికి సామగ్రి అందజేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్



మంచిర్యాల డిస్ట్రిబ్యూటర్ సెంటర్‌ను పరిశీలిస్తున్న పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



చెన్నూరులో ఎన్నికల సామగ్రితో వెళ్తున్న సిబ్బంది



వేంపల్లిలోని పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల అధికారులు



బెల్లంపల్లి డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది



కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్







సోమగూడెం(కే)లో ముస్తాబు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం, వేమనపల్లిలో ఎన్నికల సిబ్బందికి స్వాగతం పలుకుతున్న స్థానికులు, దేవాపూర్‌లో ముస్తాబు చేసిన మహిళ పోలింగ్ కేంద్రం



ఓటు వేయండి ఇలా..

దండేపల్లి, మే 12: లోకసభ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ ప్రక్రియ సోమవారం ఉదయం 7గంటల నుంచి మొదలు సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగనున్నది. ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాల విని యోగం, ఇందులో ప్రధాన ఓటు ఎలా వేయాలన్నది ఎన్నికల అధికారులు ఇప్పటికే పలుమార్లు గ్రామాల్లో ఓటర్లకు అవగాహన కల్పించారు.

- ముందుగా పోలింగ్ కేంద్రంలోకి వరుస క్రమంలో వెళ్లాలి
- ఎన్నికల సంఘం నుంచి వచ్చిన ఓటర్ల స్లిప్, మీ వెంట ఎదైన గుర్తింపు కార్డు వెంట తేచ్చుకోని పోలింగ్ సిబ్బందికి చూపించాలి. అక్కడ ఉన్న ఓటర్లు లిస్ట్‌తో క్రమ సంఖ్యను పోలింగ్ కేంద్రంలో ఉన్న ఏజెంట్‌లకు తెలియజేశారు.
- ఓటర్ల రిజిష్టర్‌లో చదువుకున్న వారు సంతకం, చదువు రాని వారు వేలిముద్ర వేయాల్సి ఉంటుంది.
- అక్కడ పోలింగ్ సిబ్బంది చూపుడు వేలికి సిరా పెడుతారు.
- తర్వాత పోలింగ్ సిబ్బంది సూచక మేరకు పోలింగ్ కంపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన ఈవీఎం యంత్రాంలో మీకు నచ్చిన వారికి ఓటు వేసుకోవాలి. వివిప్యాట్ యంత్రాంలోని మీరు ఎవరికి వేస్తే అది 7సెకండ్ ఈ యంత్రంలో కనిపిస్తుంది. ఆతర్వాత కట్ అయ్యి ప్రింటింగ్‌లోని డ్రాప్ బాక్స్‌లో పడుతుంది. ఆవెంటనే బీప్ శబ్దం వినిపిస్తుంది. ఒకవేళ మీకు బ్యాలెట్ స్లిప్ కనిపించక పోయిన , బీప్ శబ్ధం గట్టిగా వినిపించపోయినా ప్రిసైడింగ్ అధికారిని వెంటను సంప్రదించాలి.
- ఓటు వేసేందుకు 12 రకాల గుర్తింపు కార్డుల్లో దేని నైనా వినియోగించారు. ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, పాసుబుక్, పాన్‌కార్డు, స్మార్ట్ కార్డు, ఈజీఎస్ జాబ్‌కార్డు, హెల్త్ ఇన్స్యూరెస్ కార్డు, ఫోటో కలిగిన ఉన్న పెన్సన్ బుక్ వినియోగించుకోవచ్చు.

కంట్రోల్ రూమ్ పరిశీలించిన కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, మే 12: నస్పూర్‌లోని జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన సమీకృత కంట్రోల్ రూమ్‌ను ఆదివారం జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్న పోలింగ్ నేపద్యంలో సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్‌లో అంతరాయం రాకుండా విద్యుత్ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని, నిరంతరం ఇంటర్నెట్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ నిర్వహణలో పొరపాట్లకు తావు లేకుండా చూడాలని కోరారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ మోతిలాల్, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్, ఎన్నికల తహ సీల్దార్ శ్రీనివాస్, అధికారులు ఉన్నారు.

పోలింగ్‌కు పటిష్టమైన బందోబస్తు



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

ఏసీసీ, మే 12: జిల్లాలో సోమవారం నిర్వహించే పోలింగ్‌కు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ రూట్ మొబైల్ అధికారులు ఆర్మ్డ్ అధికారులతో పోలింగ్ పరికరాలను పోలింగ్ లొకేషన్‌లకు పటిష్టమైన భద్రతతో తీసుకు వెళ్లడం జరుగుతుందన్నారు. భద్రత బందోబస్తు కోసం 832 మంది సివిల్ ఫోర్స్, 384 మంది వింగ్స్‌ఫోర్స్, 300 మంది హోంగార్డులు, 300 మంది శిక్షణ కానిస్టేబుళ్లు, 700 మంది చత్తీష్‌గఢ్‌కు చెందిన హోంగార్డు, 91 మంది సింగరేణి కానిస్టేబుళ్లు, 64 మంది స్పెషల్ పార్టీ సిబ్బంది , 5 కంపెనీలకు చెందిన 443 మంది కేంద్ర బలగాల సిబ్బంది , మొత్తం 3,300 మందిని నియమించామని చెప్పారు. ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా మాని టరింగ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని లాడ్జీలు, ఫంక్షన్‌హాళ్లు చెక్ చేసి బయటి నుంచి వచ్చిన వ్యక్తులను పంపించామని వివరించారు. మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సరిహద్దు రాష్ట్రాల్లో ప్రాణహిత పరివాహక ప్రాంతాల్లో డ్రోన్ పెట్రోలింగ్ ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రాములు, ఏసీపీ ప్రకాష్, పోలీసులు పాల్గొన్నారు.

- ఎన్నికల విధులకు ఎన్‌సీసీ కెడెట్లు

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం ఎన్‌సీసీ కెడెట్లను సామాజిక సేవ, స్వచ్ఛంద ప్రతిపాదికన విధులకు వినియోగించు కుంటున్నా పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లో కెడెట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రమ శిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. ఓటర్లు క్యూ పద్ధతిలో ఉండేలా చూడాలన్నారు. విధులకు హాజరయ్యే 90 మంది కెడెట్లకు పలు సూచనలు చేశారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో ఫేక్ వీడియో పోస్టు చేసిన వ్యక్తిపై కేసు నమోదు

జైపూర్, మే 12: సోషల్ మీడియాలో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణపై ఫేక్ వీడియో సృష్టించి సోషల్ మీడియాలో పోస్టు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు జైపూర్ ఎస్సై శ్రీధర్ అన్నారు. గూగుళ్ల రవీందర్ రెడ్డి అనే వ్యక్తి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ ఇతర రాష్ట్రానికి చెందిన ఓ అమ్మాయితో వివాహేతర సంబంధం పెట్టుకుని మోసం చేశాడని ఫేక్ వీడియోను సృష్టించి సోషల్ మీడియాలో వైరల్ చేసినట్లు తెలిపారు. రజనీకాంత్ అనే అడ్వకేట్ ఫిర్యాదు మేరకు రవీందర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఫెక్ వీడియోలు పోస్టు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా ఆదిశంకరాచార్య జయంతి

ధర్మపురి, మే 12: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి అనుబంధ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని శంకరాచార్యులకు ఆలయ వేదపండితులు పంచోపనిషత్తులతో రుద్రాభిషేకం, హారతి మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. భగవద్రామానుచార్య జయంతి పురస్కరించుకుని ప్రధాన దేవాలయాల్లో గల అభిషేక మండపంలో రామానుజాచార్యా జయంతి వేడుకల్లో భాగంగా షోడశోపచార పూజ, పంచామృత అభిషేకం సూక్త పారాయణంతో, అష్టోత్తర శతనామ పూజ దివ్య ప్రభంద పారాయణం నిర్వహించారు.

జగిత్యాల టౌన్: జగిత్యాల జిల్లా కేంద్రంలోని శుభమస్తు పంక్షన్ హాలులో ఆదివారం జగద్గురు ఆది శంకరాచార్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం హోమం నిర్వహించారు.

కథలాపూర్: జగద్గురువు ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలు మండలంలోని సిరికొండలో గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం యువకులు ఆది శంకరాచార్యుని చిత్రపటానికి పూలమాలలు వేశారు.



శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయంలో ఆది శంకరుడి పూజలు

సనాతన ధర్మం బలోపేతం చేయడానికి కాశికా, గోవర్ధన, శారదా, జ్యోతిర్మఠాలను స్థాపించిన ఘనత శంకరాచార్యునికే దక్కిందన్నారు. 108 స్తోత్రాలు, గ్రంథాలు రచించిన శంకరాచార్యుడిని ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

అభ్యర్థుల్లో సర్వత్రా ఉత్కంఠ

● ప్రధాన పార్టీలో మొదలైన గుబులు ● పార్టీల ఎజెండా పనిచేసేనా?



కాగజ్‌నగర్, మే 12: పార్లమెంటు ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ సోమవారం జరుగనుండటంతో రెండునెలలుగా ఆయా పార్టీల నాయకులు ప్రచారం చేసి ఓటరు మనసు గెలుచుకునేందుకు శత విధాల ప్రయత్నాలు చేశారు. కేంద్ర, రాష్ట్రనాయకులతో బహిరంగ సభలు పెట్టినప్పటికీ ఓటరు ఎటువైపు మొగ్గు చూపుతారోనని అన్ని పార్టీల్లోని నాయకులకు టెన్షన్ మొదలైంది. బీఆర్ఎస్ పార్టీలో బరిలో ఉన్న సొంత జిల్లా అభ్యర్థి ఆత్రం సక్కు తనకున్న పరిచయాలతో మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంటింటా తిరిగారు. ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. గతంలో జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కోనేరు కోనప్ప బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి తనక్యాడర్‌తో కాంగ్రెస్‌లోకి చేరిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ పరిస్థితి తారుమారైంది. కుమురం భీం జిల్లాలో బీఆర్ఎస్ క్యాడర్‌ను, కార్యకర్తలను కాపాడుకునేందుకు ఆ పార్టీ అధిష్ఠానం ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండేవిఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి బాధ్యతలను అప్పజెప్పింది. దీంతో రెండునెలలుగా వారు క్షేత్రస్థాయిలో జిల్లాలో అన్ని మండలాల్లో విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించారు. అయితే ఓటరు బీఆర్ఎస్‌పార్టీకి మొగ్గుచూపి ఓటేస్తారా..? లేదాఅన్నది ఇప్పుడు ఆ పార్టీలో ఉన్న నాయకులందరికీ టెన్షన్ మొదలైంది. అలాగే కాంగ్రెస్ పార్టీలో జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి కీలక అడుగులు వేసింది. మాజీ ఎమ్మెల్యే కోనప్ప చేరికతో కాంగ్రెస్ పార్టీకి మరింత బలం పెరిగినట్లయింది. సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ రావి శ్రీనివాస్ కూడా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తూ క్యాడర్ పెంచుకునేందుకు చేరికల కార్యక్రమం చేపట్టారు. అలాగే గిరిజన సామాజికవర్గ ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు గిరిజన నాయకుడు మాజీ జడ్పీచైర్మన్ సిడాం గణపతిని పార్టీలోకి తీసుకున్నారు. ఆరు గ్యారంటీలతో ముమ్మరంగా ప్రచారం చేశారు. ఓటరు ఈ పార్టీని ఆదరిస్తారా..? లేదా..? అనే అంశాలు పార్టీలో ఉన్న అందరినీ టెన్షన్‌కు గురి చేస్తోంది. ఇక బీజేపీలో సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు గోడం నగేష్ విజయానికి కృషి చేస్తున్నారు. వంద రోజుల్లో తాను చేసిన అభివృద్ధి పనులు నియోజకవర్గంలో వివరిస్తూ తనదైనశైలిలో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. పీఎం మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ కూడా ఓటర్ల కలిశారు. కేంద్ర మంత్రి అమిత్ షాతో బహిరంగ సభ పెట్టి విజయవంతం చేశారు. సోమవారం జరిగే ఎన్నికల్లో బీజేపీకి ఎంత మేర ఓట్లు పడుతాయన్న దానిపై అంతా కాకి లెక్కలు వేసుకుంటున్నారు. అన్ని పార్టీల నాయకులు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఓటింగ్ శాతం పెంచాలని కేంద్ర ఎన్నికల అధికారులు మైకుల ద్వారా ప్రచారాన్ని చేశారు. సిర్పూరు నియోజకవర్గంలో 2,29,101 ఓటర్లు ఉండగా ఎంతమేర పోలింగ్ అవుతుంది. పెరిగితే తమకెంత వచ్చే అవకాశాలున్నాయన్న చర్చ మూడు పార్టీల్లో జరుగుతోంది.

విద్యుత్ వినియోగదారుల పాట్లు

● అప్రకటిత కోతలతో ప్రజలు పరేషాన్

● మరమ్మతుల పేరిట తరచూ సరఫరా నిలిపివేత

బెజ్జూరు, మే 12: మండలంలో విద్యుత్ వినియోగం పెరగడం అప్రకటిత కోతలకు దారితీస్తోంది. మరమ్మత్తులు, నిర్వహణ పేరిట తరచూ సరఫరా నిలిపివేస్తున్నారు. నిబంధ నలకు భిన్నంగా కొన్నిప్రాంతాల్లో సిబ్బంది ఇష్టారీతిన వ్యవహ రించడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారికంగా ఎలాంటి కోతలు లేవని అధికారులు పైకి చెబుతున్నా అనధికారికంగా అప్రకటితకోతలు విధిస్తుండటం వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తోంది. క్షేత్రస్థాయిలో కీలకమైన ఏడీఈలు, ఏఈల పాత్ర అత్యంత కీలకమైనది. కానీ కొంతమంది లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్లు గ్రామస్థాయిలో పనిచేసే తాత్కాలిక ఉద్యోగులపై వదిలేయడంతో సరఫరాలో అంతరాయానికి దారి తీస్తోంది.

రాత్రివేళ ఇబ్బందులు..

ఇటీవల మండలంలో తరచూ విద్యుత్ సరఫరాలో తీవ్రఅంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా అర్ధరాత్రి ఇష్టారీతిన విద్యుత్ కోతలు పెరగడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అసలే వేసవికాలం కావడంతో రాత్రిపూట కోతలు పెరగడంతో ఉక్కపోత, దోమలతో తీవ్రఅవస్థలు పడుతున్నారు. వేసవిలో ఎండల తీవ్రత పెరగడంతో ఉక్కపోతకు భరించలేకపోతు న్నారు. ఇటీవల చిన్నపాటి గాలివీచినా, వర్షం కురిసినా విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. ఈస్‌గాం విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి బెజ్జూరు తదితర మండలాలకు సరఫరా అవుతుండటం మధ్యలో ఏ చిన్నపాటి సమస్య తలెత్తినా గంటల తరబడి విద్యుత్‌కు అంతరాయం కలుగుతోంది. సుమారు ఈస్‌గాం నుంచి 90కిలోమీటర్ల దూరం నుంచి అటవీ ప్రాంతం నుంచి విద్యుత్‌లైన్ ఉండటంతో నిత్యం అంతరాయం ఏర్పడు తోంది. ప్రతి ఏటా వర్షాకాలం ప్రారంభంలో ఇదే సమస్య తలెత్తుతోంది. అధికారులు స్పందించి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రత

• ఇండో టిబెటన్ బార్డర్ పోలీసు బలగాల బందోబస్తు • కేటీఆర్ రోడ్ షో ఘటనల నేపథ్యంలో అప్రమత్తంగా పోలీసుశాఖ



భైంసాలో బందోబస్తు ఏర్పాట్లను సమీక్షిస్తున్న ఏఎస్పీ



ఎన్నికల బందోబస్తుకు తరలివచ్చిన ఐటీబీ పోలీసు బలగాలు

భైంసా, మే12: మతకల్లోలిత ప్రాంతంగా ముద్రపడ్డ భైంసాలో పార్లమెంట్ ఎన్నికలను పురస్కరిం చుకొని పోలీసుశాఖ పటిష్ట భద్రతాచర్యలు చేపట్టింది. ఐదురోజుల క్రితం భైంసా పట్టణ పరిధిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్‌షో సందర్భంగా పలు ఘటనలు చోటుచేసుకున్న నేపథ్యంలో పోలీసుశాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకూ తావీయకుండా ఉండేందుకుగాను ప్రణాళికబద్ధమైన బందోబస్తు చర్యలకు ఉపక్రమించింది. భైంసా ఏ ఎస్పీ కాంతిలాల్ పాటిల్, టౌన్ సీఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టారు. సబ్‌డివిజన్ పరిధిలో మొత్తం 311 పోలింగ్ కేంద్రాలు ఉండగా 52సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయి ఇందులో భైంసా పట్టణ పరిధిలో 42 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 23 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. భైంసాలోని 42పోలింగ్ కేంద్రాలను నాలుగు జోన్లుగా విభజించి భద్రతా చర్యలు చేపట్టారు. పట్టణ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఇండో టిబెటన్ బార్డర్ పోలీసు బలగాల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రంవద్ద ఒకఎస్‌ఐతోపాటు నలుగురు ఐటీబీ పోలీసులు, నాలుగు మంది సివిల్ కానిస్టేబుళ్లను బందోబస్తు కోసం నియమించారు. వీరితోపాటుజోన్, రూట్లలో పర్యవేక్షణకు ప్రత్యేకపోలీసు బలగాలను ఏర్పాటు చేశారు. పట్టణవాసులందరూ పార్లమెంట్ పోలింగ్‌ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతిఒక్కరూ పోలీసుశాఖకు సహకరించాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, సీఐ విజ్ఞప్తి చేశారు.



ఎన్నికల సామగ్రి పంపిణీ పరిశీలిస్తున్న కలెక్టర్

పోలింగ్ సజావుగా నిర్వహించండి

• ఎన్నికల అధికారి ఆశీష్ సంగ్వాన్ • ఎన్నికల సామగ్రి పంపిణీ పరిశీలన

నిర్మల్ కల్చరల్, మే12: పోలింగ్ సిబ్బంది ఎన్నికలను సజావుగా నిర్వహించాలని ఎన్నికల అధికారి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశించారు. ఆదివారం ఎన్నికల సామగ్రి పంపిణీ సరళిని పరిశీలించారు. నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాల పంపిణీ కేంద్రాలు సందర్శించారు. సకాలంలో సిబ్బంది తమ పోలింగ్‌కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. రాజకీయ పార్టీల సమక్షంలో ఉదయం 5:30కి మాక్ పోలింగ్ నిర్వహించాలని 7గంటలకు పోలింగ్ ప్రారంభించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలు విజయవంతం చేయాలన్నారు. పోలింగ్ ఉదయం 7 నుంచి సాయంత్రం 6వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందని, ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. నిర్మల్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈవీఎంల పంపిణీ కేంద్రంలో ఎన్నికల వ్యయ పరిశీలకుడు జాదవార్ వివేకానంద్‌తో కలిసి పాల్గొన్నారు. వారివెంట అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఆర్డీవోలు రత్న కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు పకడ్బందీగా చర్యలు

నర్సాపూర్(జి), మే 12: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జరగనున్న పోలింగ్‌ను పకడ్బందీగా జరిగేలా చూడాలని ఎంపీడీవో పుష్పలత తెలిపారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి క్లియర్ చేయాలని సూచించారు. ఉదయం 7నుంచి పోలింగ్ ప్రారంభించాలని, ఎటువంటి చిన్నసంఘటనకు, పొరపాటుకు తావివ్వకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈవీఎంలలో సాంకేతిక సమస్య తలెత్తితే రిప్లేస్ చేసేందుకు సెక్టోరియల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కుంటాల, మే12: మండలంలోని అర్లి ఎక్స్ రోడ్డు సమీపంలో వ్యవసాయ పొలిమెరల్లో 50-55 ఏళ్ల గల ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం అర్లిఎక్స్ రోడ్డు సమీపంలో పెట్రోల్ బంక్ వెనుకాల ఖాళీ స్థలంలో అక్కడి యువకులు క్రికెట్ ఆడేందుకు వెళ్లారు. క్రికెట్ ఆడుతున్న సమయంలో బంతి అటువైపు వెళ్లింది. బంతి తీసుకరావడానికి వెళ్లిన యువకుడికి మృతదేహం కనిపించడంతో స్థానికులకు తెలిపాడు. పలువురు అక్కడికి చేరుకొని ఆచూకీ కోసం చుట్టుపక్కల వారిని సంప్రదించినా ఆచూకీ లభించలేదు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు పసుపురంగు షర్టు, నల్లటి ప్యాంటు ధరించి ఉన్నాడు. ఎండ తీవ్రతకు ఉక్కపోత నుంచి ఉపశమనం కోసం ఆ వ్యక్తి షర్టు తీసేసి ఆయన కాళ్ల మధ్య పెట్టుకొని చెట్టుకింద సేదతీరేందుకు వచ్చి ఉంటాడని, ఉష్ణోగ్రత అధికమవడంతో అస్వస్థతకు గురై మృతిచెంది ఉంటాడని పలువురు భావిస్తున్నారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహానికి పంచనామ నిమిత్తం భైంసా ఆసుపత్రికి తరలించారు.

అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కే. లక్ష్మణ్

బాసర, మే 12: బాసర సరస్వతీ అమ్మవారి ఆల యాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి కే.లక్ష్మణ్ సంద ర్శించారు. కుటుంబసభ్యులతో ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అ మ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించా రు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేసి ఆలయ పండితులు ఆశీర్వదించారు.

పోచమ్మ తల్లికి మొక్కులు తీర్చుకున్న భక్తులు

సారంగాపూర్, మే12: మండలంలోని అడెల్లి మహా పోచమ్మ దేవాలయం వద్ద ఆదివారం పోచమ్మ తల్లికి భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. ఈ ఆలయానికి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగ ర్ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్రలోని నాందేడ్, నాగపూర్ జిల్లా నుంచి మొక్కులు తీర్చుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులు కో నేరులో స్నానం చేసి అమ్మవారికి పెరుగన్నంను నైవే ద్యంగా సమర్పించారు. మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండడానికి ఆలయ ఇన్‌చార్జి ఈవో రంగు రవి కిషన్ గౌడ్ అన్ని ఏర్పాట్లు చేశారు.



అడెల్లి ఆలయం వద్ద జాతకాన్ని అడిగి తెలుసుకుంటున్న మహిళా భక్తులు

వారాంతపు సంత రద్దు

భైంసా, మే 12 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పట్టణ పరిధిలో సోమవారం జరిగే వారాంతపు సంతను రద్దు చేసినట్లుగా భైంసా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలను పురస్కరించుకొని పోలీసు శాఖ పట్టణ పరిధిలో 144 సెక్షన్ విధించిన నేపథ్యంలో వారాంతపు సంతను రద్దు చేసినట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. సంతకు వచ్చే క్రయ, విక్రయదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లాలో 42.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

మంచిర్యాల కలెక్టరేట్, మే 12: మంచిర్యాల జిల్లాలో ఆదివారం అధికంగా 42.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చెన్నూరులో 42.2, భీమారం, జన్నారంలో 41.9, భీమినిలో 41.8, జైపూర్‌లో 41.5, కాసిపేటలో 41.4, వేమనపల్లి, కోటపల్లిలో 41.1, నెన్నెలో 40.9, హాజీపూర్‌లో 40.8, కన్నెపల్లిలో 40.7, నస్పూర్, మంచిర్యాలలో 40.3, దండేపల్లిలో 40.2, బెల్లంపల్లి, లక్సెట్టిపే టలో 39.7, మందమర్రిలో 39.6, తాండూర్‌లో 39.5 డిగ్రీలు నమోద య్యాయి. తీవ్రమైన ఉక్కపోత ఉండడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు.

సీఎంపీఎఫ్‌లో సవరణలకు బోర్డు సిద్ధం

శ్రీరాంపూర్, మే 12 : కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్(సీఎంపీఎఫ్) చట్టం-1948కి సవరణలు చేసేందుకు సీఎంపీఎఫ్ బోర్డు సిద్ధమైనట్లు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. 76 ఏళ్లనాటి చట్టంలో పలు అంశాలు లోపభూయిష్టంగా ఉండడం, ప్రస్తుత కాలానికి సరిపోకపోవడం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ కారణంగా బోర్డు చైర్మన్ అమృత్‌లాల్‌మీనా ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన సమావేశంలో సవరణకు అంగీకరించినట్లు తెలిపారు. పీఎఫ్, పెన్షన్ పథకంలోనూ మార్పులుంటాయని పేర్కొన్నారు. ప్రస్తుత నిబంధనలను సవరించడం, తొలగించడం, జతచేయడం చేస్తారన్నారు. ఈ విషయంలో త్వరలో కన్సల్టెంట్‌ను నియమించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తారని, చట్ట సవరణకు పార్లమెంటు ముందుంచుతారని పేర్కొన్నారు. లోక్‌సభ, రాజ్యసభల్లో అనంతరం రాష్ట్రపతి ద్వారా ఆమోదం పొందిన తరువాత గెజిట్‌లో ప్రచురిస్తారన్నారు. అనంతరం చట్టం అమల్లోకి వస్తుందని వివరించారు. ఈ సవరణల వల్ల కార్మికులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన పిల్లల సమ్మర్ క్యాంపు



సమ్మర్ క్యాంపులో పాల్గొన్న పిల్లలు

ఏసీసీ, మే 12: జిల్లా కేంద్రంలో మైత్రియోగా ప్రకృతి చికిత్స కేంద్రం ఆధ్వర్యంలో గత 15 రోజుల నుంచి నిర్వహిస్తున్న పిల్లల సమ్మర్ క్యాంపు ఆదివారం ముగిసింది. నిర్వాహకులు డాక్టర్ సుకుమార్, డాక్టర్ సమీరాల ఆధ్వర్యంలో 5 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు అనుభవ జ్ఞులైన శిక్షకులతో నృత్యం, ధ్యానం, యోగా, కరాటే, వ్యక్తిత్వ వికాసం, సంగీతం, పాటల్లో శిక్షణ ఇచ్చారు. ప్రతిభ కనబర్చిన పిల్లలకు బహుమతులు అందించారు. ఈ నెల 17 నుంచిమరో బ్యాచ్ ప్రారంభమవుతుందని, వివరాలకు 9652227079లో సంప్రదించాలని కోరారు..

ఘనంగా ప్రపంచ మాతృ దినోత్సవం


వృద్ధురాళ్లను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

మంచిర్యాల కలెక్టరేట్, మే 12: జిల్లా కేంద్రంలోని ఆనంద నిలయం వృద్ధాశ్రమంలో ఆదివా రం ప్రపంచ మాతృ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి తన సతీమణి రజనీరెడ్డితో కలిసి ఆశ్రమంలోని వృద్ధురాళ్లను శాలువాలతో సన్మానించారు. పండ్లు, మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి మహేందర్, కార్యవర్గ సభ్యుడు కిషన్, ఆశ్రమం నిర్వాహకులు సదానందం, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన యువకులు

బెల్లంపల్లి, మే 12: బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తుల సుదర్శన్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం బీఆర్ఎస్ యువ నాయకులు రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదానం చేశారు. 30 మంది నాయకులు రక్తదానం చేసి బ్లడ్‌బ్యాంకుకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు చరణ్, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా శంకరాచార్య జయంతి

మందమర్రిరూరల్, మే 12: ఆదిశంకరాచార్య జయంతిని బ్రహ్మంగారి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి కుషకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణులు లక్ష్మీనారాయణ, వేణు, తిరుపతి, రవీంద్రచారి, రాజవీరు, శ్రీనివాస్, రాజమొగిలి తదితరులు పాల్గొన్నారు.

'మతతత్వ పార్టీలను ఓడించాలి'

మందమర్రిటౌన్, మే 12: దేశ వ్యాప్తంగా జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో మనువాద మతోన్మాద శక్తులకు గుణపాఠం చెప్పాలని, లౌకిక ప్రజాస్వామ్య శక్తులను గెలిపించాలని జర్నలిస్టు ఫోరం నాయకుడు, సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్, ప్రముఖ కవి, రచయిత సుందిళ్ల రాజయ్య అన్నారు.. ఆదివారం మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పదేళ్ల బీజేపీ పాలనలో సంపన్న వర్గాలకే పెద్దపీట వేసి ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీశారని మండిపడ్డారు.

సిబ్బంది అవస్థలు

- పట్టించుకోని అధికారులు- చర్యలు తీసుకోవాలని వినతి


కిటికీల వద్ద ఏర్పాటు చేసిన కూలర్లు

శ్రీరాంపూర్, మే 12: శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో పర్సనల్ విభాగాన్ని అన్ని హంగులతో నిర్మిం చారు. కార్పొరేట్ కార్యాలయాల మాదిరిగా క్యాబిన్లు, అద్దాలు, తదితరాలు ఏర్పాటు చేశారు. కానీ అందులో పనిచేసే సిబ్బందికి సౌకర్యాలు కల్పించడంలో అధికారులు వెనకబడ్డారు. ప్రస్తుతం ఎండాకాలం భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేడిని తట్టుకోవడానికి ఇళ్లల్లోనే ఏసీలు బిగించుకుంటున్నారు. కానీ కంపెనీ వద్ద బడ్జెట్ లేదేమో పర్సనల్ విభాగంలో ఏసీలు ఏర్పాటు చేయలేదు. ఫ్యాన్ గాలి సరిపోవడం లేదు. పైగా వేడిగా వస్తోంది. దీనివల్ల ఆ విభాగం సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. కంప్యూటర్లు కూడా హ్యాంగ్ అయిపోతున్నాయి. పని ముందుకు సాగడం లేదు. అటు పనిభారం, ఇటు ఉష్ణోగ్రతలతో అసౌకర్యం కలుగుతోంది. ఏసీలు బిగించాలని ఎన్నోమార్లు ఉన్నతాధికారులకు విన్నవించగా, చివరకు కిటికీల వద్ద కూలర్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. కూలర్లు పాడైనప్పుడు వాటిని రిపేర్ చేసే వ్యక్తి ఒక్కరే ఉండడంతో సమయానికి పని పూర్తి చేయడం లేదు. చాలా రోజులుగా అతని వద్దే ఉండిపోతున్నాయి. ఇది మరొక సమస్యగా మారింది. వేడి ఎక్కువగా ఉందని, శాశ్వత పరిష్కారంగా ఏసీలు ఏర్పాటు చేయాలని సిబ్బంది కోరుతున్నారు.

వర్షం.. ఈదురు గాలుల బీభత్సం

● నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, వృక్షాలు ● ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంలో నేలకొరిగిన టెంట్లు
● పోలింగ్ బూత్‌ల ఎదుట చేరిన వరద నీరు ● ఇబ్బందులు పడ్డ ఎన్నికల సిబ్బంది

ఆసిఫాబాద్, మే 12: జిల్లావ్యాప్తంగా ఆదివారం ఈదురు గాలులతో కూడిన భారీవర్షం కురిసింది. దీంతో ఈదురుగాలులకు ఆయా మండలాల్లో చెట్లు, విద్యుత్‌స్తంభాలు విరిగిపడ్డాయి. వర్షం కురియడంతో పోలింగ్ సిబ్బంది పోలింగ్‌కేంద్రాలకు చేరుకునేందుకు ఇబ్బందులుపడ్డారు. జిల్లా కేంద్రంలో ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల చెట్లు విరిగిపడగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఆసిఫాబాద్‌పట్టణంలోని పీటీజీ బాలుర పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద ఈదురు గాలులకు టెంట్లు కూలిపోయాయి. టెంట్లు కూలిన సమయంలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. టెంట్లు పూర్తిగా నేలకొరగడంతో ఎన్నికల రిజర్వు సిబ్బంది వరండాలలో తలదాచుకుని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం పంపిణీ పూర్తయ్యాక వర్షం కురియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. లేనిపక్షంలో సిబ్బందితోపాటు ఎన్నికల సామగ్రి తడిసేది. ఇదిలా ఉండగా ఆసిఫాబాద్ పట్టణంలోని జడ్పీ బాలుర పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన నాలుగు పోలింగ్ బూత్‌లలోకి భారీవర్షం కారణంగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో పోలింగ్ కేంద్రాల వద్ద వరదనీరు చెరువులను తలపించాయి. అదేపోలింగ్ బూత్‌లలో ఆదర్శపోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అధికారులు షామియానాలు సిద్ధం చేయగా ఈదురు గాలులతో పనులకు ఆటంకం ఏర్పడ్డాయి. వరదనీటిని దాటలేక పోలింగ్‌సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిల్డ్రన్స్‌పార్కు సమీ పంలో ఈదురుగాలులతో టేలా ఎగిరిపడి రోడ్డుపై పడిపోయింది. ఎన్నికల సామగ్రి పంపిణీకేంద్రం వద్ద వరద నీటితో నిండిపోయి చెరువును తల పించింది. అదేవిధంగా ఆయా మండలాల్లో కురిసిన వర్షానికి పోలింగ్ సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలులు, వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో కొన్ని కేంద్రాల్లో పోలింగ్ సిబ్బంది చీకటిలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఆసిఫాబాద్ మండలంలోని గుండి వాగు తాత్కాలిక వంతెన భారీ వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో పోలింగ్‌సిబ్బంది వాంకిడి మండలం కన్నర్‌గాం మీదుగా గుండి పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. తుంపెల్లి గ్రామంలో ఇంటిపై చెట్టు పడింది. అదృష్టవశాత్తు అందులో నిదిరిస్తున్న ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు. క్షేమంగా బయటపడ్డారు.

సిర్పూర్(యు): మండలంలోని ఆయాగ్రామాల్లో ఆదివారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. నాలుగైదు రోజులుగా మండలంలో ఓమోస్తరు వర్షం కురుస్తుండగా ఆదివారం భారీగా వర్షం పడింది. దాదాపు రెండు గంటలపాటు వర్షం పడింది. దీంతో వాతావరణం చల్లబడింది. వర్షం భారీగా పడడంతో ఇండ్లలోకి వరద నీరు చేరింది.

దహెగాం: మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. మండలంలోని ఇట్యాల గ్రామంలో ఏర్పాటుచేసిన మోడల్ పోలింగ్ కేంద్రం గాలివానకు కూలిపోయింది. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. టార్పా లిన్ కవర్లు కప్పే ప్రయత్నం చేసినప్పటికీ ధాన్యం కొట్టుకుపోయి రైతులు ఇబ్బందులు పడ్డారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్‌పట్టణంలో ఆదివారం సాయంత్రం అకాల వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురియటంతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఐదు నుంచి మొదలైన వర్షం రాత్రి ఏడుగంటల వరకు కురిసింది. ఈదురు గాలులు అధికంగా వీచడంతో విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. దీంతో పట్టణంలో అంధకారం నెలకొంది. సాయంత్రం పూట నిర్వహించే చిరు దుకాణాల కవర్లు లేచిపోయాయి.


ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పోలింగ్‌కేంద్రంలోకి చేరిన వరదనీరు


సిర్పూర్(యు)లో కురుస్తున్న వర్షం


దహెగాంలో కూలిపోయిన మోడల్ పోలింగ్ కేంద్రం షామియానా


వరద నీటిలో నుంచి బైక్‌ను తీసుకు వస్తున్న పోలీసు


ఆసిఫాబాద్‌జిల్లా కేంద్రంలోని ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రంలో నేలకూలిన టెంట్లు



ఆసిఫాబాద్‌జిల్లా కేంద్రంలో విరిగి పడ్డ చెట్లు, విద్యుత్ స్తంభం


గుండి పెద్దవాగులో వరదతో కొట్టుకు పోయిన తాత్కాలిక రోడ్డు

కార్మికుల పనివేళల్లో మార్పులు చేయాలి

-మావోయిస్టు కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సింగరేణి ప్రాంతంలో 45 డిగ్రీల పై చిలుకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ఓసీలు, సీహెచ్‌పీ వర్క్‌షాప్ డిపార్ట్‌మెంట్లలో కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా పనివేళల్లో మార్పులు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఆదివారం విడుదల చేసిన ఒక లేఖలో డిమాండ్ చేశారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా కార్మికులు అనారోగ్యాలకు గురవుతున్నారని, రెండు గంటల సమయాన్ని తగ్గించి గతంలో లాగా పనివేళల్లో తక్షణ మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. సీఎండీ మాట్లాడగా పనివేళల మార్పిడికి యాజమాన్యం ఒప్పుకుందని సర్కారు సంఘం ఐఎన్టీయూసీ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీలు పోటీపడి ప్రచారం చేసుకున్నాయని పేర్కొన్నారు. ఎనిమిది గంటల పని విధానంతోనే సమయపాలన మార్పి విధులు కేటాయిస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించిందని తెలిపారు. పైరవీలకు అలవాటు పడి తప్పుడు సలహాలు ఇస్తూ కార్మికుల హక్కులు, సౌకర్యాలను యాజమాన్యానికి తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. ఎండలు మండుతున్నా సమయసారిణి మార్చకపోగా, చర్చల పేరిట కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. గుర్తింపు ప్రాతినిథ్య సంఘాల కేంద్ర నాయకులు, అధికారులు కుమ్మక్కై కార్మికులపై భారం పెంచే కుట్రలు మానుకోవాలని సూచించారు. యాజమాన్యం ఆరు గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టడంతోపాటు టార్గెట్లు పెట్టడం మానుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు చల్లని నీరు, ఎలక్ట్రోల్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు అందించాలని పేర్కొన్నారు. దిగజారుడుతనంతో వ్యవహరిస్తున్న ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ నాయకులను కార్మికులు నిలదీయాలని పిలుపునిచ్చారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

- తహసీల్దార్ సంధ్యారాణి

దండేపల్లి, మే 12: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని దండేపల్లి తహసీల్దార్ సంధ్యారాణి సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్ల స్లిప్పుతో పాటు 12 రకాల గుర్తింపు కార్డులలో ఏదైన ఒకటి పోలింగ్ కేంద్రానికి వెంట తీసుకరావాలన్నారు.12 రకల గుర్తింపు కార్డులు ఓటరు గుర్తింపు కార్డులో పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, పాసుబుక్, పాన్‌కార్డు, స్మార్ట్ కార్డు, జాబ్‌కార్డు, హెల్త్ ఇన్సూరెస్ కార్డు,ఆధార్‌కార్డు, బ్యాంకు, పోస్టుఆఫీస్ జారీ చేసిన పాసు పుస్తకం, ఫోటో కలిగిన ఉన్న పెన్షన్ బుక్ చూపి ఓటు వినియోగించుకోవచ్చుని తహసీల్దార్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ..

దండేపల్లి, మే 12: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సమయంలో పోలింగ్ కేంద్రంలోకి ఎవరిని అనుమతించాలి? ఎవరిని అనుమతించ వద్దు అనే విషయంలో ఎన్నికల సంఘం నిబంధనలు విధించింది.

- ప్రతీ అభ్యర్థి, అభ్యర్థికి చెందిన ఒక ఎన్నికల ఏజెంట్, పోలింగ్ ఏజెంట్
- ఎన్నికల విధులపై వచ్చే ఉద్యోగులు, ఎన్నికల పరిశీలకులు.
- ఎన్నికల సంఘం గుర్తించిన సూక్ష్మ పరిశీలకులు, వీడియోగ్రాఫర్లు, ఫోటోగ్రాఫర్లు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రల్లో వెబ్‌కాస్టింగ్ సిబ్బంది.
- అంగవైకల్యం, అంధు ఓటరుకు సహాయకంగా వచ్చే వ్యక్తులు.
- ఎన్నికల సంఘం అనుమతించిన మీడియా ప్రతినిధులు.
- పోలింగ్ కేంద్రంలోకి వీరికి ప్రవేశం లేదు...
- పబ్లిక్ సర్వేంట్లుగా విధులపై వచ్చే పోలీసులను శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు మాత్రమే పోలింగ్ బూత్‌కి అనుమతిస్తారు.
- జడ్‌ప్లస్ కేటగిరీ తప్ప ఓటరు వెనుక వచ్చే సెక్యూరిటి సిబ్బంది, పోటీ చేసే అభ్యర్థి వెనుక ఉండే భద్రతా అధికారులు పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించ వద్దు.

భారీగా నగదు, మద్యం పట్టివేత

జగిత్యాల, మే 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు అయినప్పటి నుంచి ఇప్పటివరకు భారీగా నగదు, లిక్కర్, బంగారాన్ని పోలీసులు, అధికారులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో ఈనెల 10వ తేదీ వరకు సుమారు రూ. 3,97,36,336 విలువ గల నగదు, లిక్కర్, గోల్డ్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో రూ. 2,21,53,310 నగదు ఉంది. అదేవిధంగా సుమారు రూ. 14,43,015 విలువ గల సుమారు 2,769 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ. 67,45,011 విలువ ఇతర సామగ్రిని సీజ్ చేశారు. రూ. 90 లక్షల విలువల గల 1.506 కేజీల బంగారం, రూ. 3.95 లక్షల విలువ గల 15.81 గంజాయి పట్టుకున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 612 మంది వ్యక్తులను బైండోవర్ చేశారు. 45 ఆయుధాలు డిపాజిట్ చేశారు.

నిబంధనలు తప్పని సరి..

దండేపల్లి, మే 12: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ రోజున అధికారులు, అభ్యర్థులు, ఓటర్లు, రాజకీయ పార్టీలు, పలు నియమాలను పాటించాల్సి ఉంటుంది. ఇందుకు పలు నియమాలను అమలు చేస్తున్నారు.

● రాజకీయ పార్టీల మద్దతుదారులకు..

- పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల పరిధిలో ఎక్కడ నాలుగుకంటే ఎక్కువ మంది గుమ్మికూడడం, చర్చలు నిర్వహించడం చేయకూడదు.
-పోలింగ్ కేంద్రం వద్ద 144సెక్షన్ అమల్లో ఉంటుంది.
- పోలింగ్ కేంద్రాల వద్ద నిర్ణీత దూరం లోపు పార్టీలు సమావేశం, శిబిరాలు పెట్టవద్దు.
- వంద మీటర్ల దూరం తర్వాత ప్రచార పత్రాలు పంచాల్సి ఉంటోంది.
- పోలింగ్ కేంద్రం ప్రాంగణంలోకి రాకూడదు.

● పోటీ చేస్తే అభ్యర్థులు జాగ్రత్తలు ఇవీ..

- పోలింగ్ స్టేషన్లలో తమకు మద్దతుగా ప్రచారానికి ఉపయోగపడేలా పోస్టర్లు జెండాలు, చిహ్నాలు, గుర్తులు, స్టిక్కర్లు వినియోగించవద్దు.
- ఎన్నికల కమిషన్ అనుమతి ఉన్న వాహనాలను అభ్యర్థులు వినియోగించాలి.
- విధిగా సంబంధిత అనుమతి పత్రాలను వాహనం ముందు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలి.

● అధికారులకు..

- ఎన్నికల కమిషన్ జారీ చేసిన పాస్‌లు ఉన్న వారినే లోపలికి అనుమతించాలి.
- పోలింగ్ బూత్‌లలో ఎలాంటి వ్యాఖ్యనాలు, ఓటర్లను ప్రభావితం చేసే మాటలు మాట్లాడకూడదు.
- అధికారులు అనుమతించిన పాసులు స్పష్టంగా బయటకు కనిపించేలా ప్రదర్శించాలి.

● ఓటర్లకు..

- పోలింగ్ స్టేషన్‌కు విధిగా 12 రకాల గుర్తింపు కార్డులో ఏదైన ఒకటి వెంట తీసుకెళ్ళాలి.
- ఈవీఎం యంత్రంలో ఏర్పాటు చేసిన బటన్ నొక్కాల్సి ఉంటుంది.
- పోలింగ్ కేంద్రం వద్ద తోటి ఓటర్లను ప్రభావితం చేయడం, మాట్లాడడం చేయకూడదు.

ఇంటర్‌లో అడ్మిషన్లు ప్రారంభం

- అందుబాటులో జనరల్, ఒకేషనల్ కోర్సులు
- అన్ని వసతులతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు


ఏసీసీ, మే 12: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్‌లకు మాధ్యమిక విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్‌ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభించనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఎయిడెడ్ సాంగీక సంక్షేమ గిరిజన మైనార్టీ గురుకుల , మోడల్ జూనియర్ కళాశాలల్లో ఒకేసారి అడ్మిషన్‌లు నిర్వహించనున్నారు.

- అందుబాటులో 20 కోర్సులు..

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో విద్యార్థులకు జనరల్ సైన్స్ విభాగంలో ఎంపీసీ, బైపీసీ, హ్యూమానిటీస్ విభాగంలో ఎంఈసీ, హెచ్‌ఈసీ, హెచ్‌జీఈ, సీఈసీ, సీఈజీ వంటి 20 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒకేషనల్ విభాగంలో అగ్రికల్చర్, బిజినెస్ అండ్ కామర్స్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కోర్సులు, హోంసైన్స్‌కు సంబంధించిన 21 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. జనరల్ విభాగంలో దాదాపు అన్ని కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ , హెచ్‌ఈసీ విభాగాల్లో ఒక్కో గ్రూపులో దాదాపు 60 సీట్లు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి.ఒకేషనల్‌కు సంబంధించి ఆయా కోర్సులు పొందిన అడ్మిషన్‌లనుబట్టి సీట్ల సంఖ్యను నిర్ణయిస్తారు.

- 16 కళాశాలలు..

జిల్లాలో 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, సోషల్ వెల్ఫేర్ , బీసీ, మైనార్టీ వెల్ఫేర్, రెసిడెన్షియల్, మోడల్ జూనియర్ కళాశాలలు 6 , మొత్తం 16 ప్రభుత్వ యాజమా న్యాల కళాశాలలు అందుబటులో ఉన్నాయి. ప్రతి కళాశాలలో సైన్స్ విద్యార్థులకు అవస రమైన సైన్స్ ల్యాబ్, పరికరాలు, ఒకేషనల్ విద్యార్థులకు అవసరమైన పరికరాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారు. దారిద్రరేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులందరికి స్కాలర్‌షిప్ కూడా ప్రభుత్వం అందిస్తుంది. ప్రైవేటుకు ధీటుగా మెరుగైన ఫలితాలు కూడా సాధించడం గమనార్హం.


మంచిర్యాలలోని టీఎస్‌మోడల్ జూనియర్ కాలేజీ

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కుమరం భీం జిల్లా వార్తలు
6
సోమవారం 13 మే 2024


ఆసిఫాబాద్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో సిబ్బందిని తరలించేందుకు ఏర్పాటు చేసిన వాహనాలు

- జిల్లా వ్యాప్తంగా 676 కేంద్రాల్లో నేడు పోలింగ్
- ఉదయం 7నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతాల వెల్లడి
- గట్టి బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

పోలింగ్‌కు సర్వం సిద్ధం









ఆసిఫాబాద్/కాగజ్‌నగర్, మే 12: నెల రోజుల పాటు సాగిన ప్రచార పర్వంలో నువ్వా? నేనా..! అన్నట్టు తలపడిన అభ్యర్థుల తలరాతను సోమవారం ఈవీఎంలో ఓటర్లు నిక్షిప్తం చేయనున్నారు. ఆదిలాబాద్ లోక్‌సభ స్థానానికి జిల్లా లోని సిర్పూరు(001), ఆసిఫాబాద్(05) నియోజకవర్గాలలో నేడు పోలింగ్ జరుగనుంది. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో ఓటర్ల తుది నిర్ణయాన్ని నిక్షిప్తం చేయటం కోసం మొత్తం 676 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసింది. ఇందులో ఆసిఫాబాద్ నియోజకవర్గానికి సంబంధించి పది మండలాల పరిధిలో మొత్తం 356పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, సిర్పూరు నియోజకవర్గం పరిధిలో 320పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజక వర్గాల పరిధిలోని కాగజ్‌నగర్ పట్టణంలోని సెయింట్ క్లారెట్ పాఠశాలలో, ఆసిఫాబాద్ పట్టణంలోని పీటీజీ బాలుర గురుకుల పాఠశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికలలో 20శాతం రిజర్వుడ్ సిబ్బందితో కలుపుకొని మొత్తం 3244 మందిని నియమించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ సురేష్ కుమార్ పరిశీలించారు. సిర్పూర్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా అదనపుకలెక్టర్ దీపక్ తివారి, ఆసిఫాబాద్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా అదనపు కలెక్టర్ దాసరి వేణును నియమించారు. ఆదివారం ఎన్నికల సిబ్బంది విధుల్లో చేరి బ్యాలెట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌లతో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో మొత్తం 91రూట్లను ఏర్పాటు చేసి 91 మందిని రూట్ అధికారులుగా నియమించారు. జిల్లాలో 91మంది మైక్రో అబ్జర్వర్లు, 91మంది సెక్టోరియల్ అధికారులను నియమించారు. లోక్‌సభ ఎన్నికలకు జిల్లాలో 10మహిళ పోలింగ్ కేంద్రాలు, రెండు దివ్యాంగ పోలింగ్ కేంద్రాలు, యువతకు రెండు పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, సీసీకెమెరాలకు అనుసంధానంచేశారు. ప్రతి రూట్‌లో వెళ్లె వాహనానికి జీపీఎస్ సిస్టంను అమర్చారు.

ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 55పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మకప్రాంతాలుగా, 24 పోలింగ్ స్టేషన్లు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా, 61 పోలింగ్ కేంద్రాలు ఆన్‌లైన్ సౌకర్యం లేనివిగా గుర్తించిన నేపథ్యంలో ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎలాంటి అ వాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ గట్టి బందోబస్తు చర్యలను చేపడుతోంది.

ఇందుకుగాను సీఆర్‌పీఎఫ్, పారామిలటరీ బలగాలతో పాటు రాష్ట్ర ప్రత్యేక పోలీసు విభాగం సిబ్బంది, పోలీసులు, హోంగార్డులు, అటవీ శాఖ సిబ్బందిని ఎన్నికల విధుల్లో నియమించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలకు కలుగకుండా గాలి, వెలుతురు ఉండేలా చర్యలు చేపట్టారు. అలాగే క్యూ లైన్లలో ఓటర్లు ఇబ్బంది పడకుండా ఉండటం కోసం పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటి వసతితో పాటు మూత్రశాలలు ఏర్పాటు చేశారు. ఉదయం 7గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించిన తర్వాత ఓటింగ్ ప్రారంభిస్తారు. సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. ఈ క్రమంలో ప్రతి రెండు గంటలకు ఒకసారి అన్ని పోలింగ్ కేం ద్రాల నుంచి పోలింగ్ శాతాన్ని ప్రకటించే ఏర్పాట్లు చేశారు. ఓటింగ్ తర్వాత ఈవీఎంలను సురక్షితంగా స్ట్రాంగ్ రూంలకు తరలించడానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

జిల్లాలో 4,56,309 మంది ఓటర్లు..

ఆసిఫాబాద్ జిల్లాలోని రెండునియోజకవర్గాల పరిధిలో మొత్తం 4,56,309మంది ఓటర్లు ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంలో బరిలో ఉన్న 12మంది అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్దేశించ బోతున్నారు. ఇందులో 2,28,971 మహిళలు, 2,27,310 మంది పురుషులు, ఇతరులు 28 మంది ఉన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మొత్తం 2,27,208మంది ఓటర్లు ఉండగా ఇందులో 1,14,404మంది మహిళా ఓటర్లు ఉండగా, పురుషులు 1,12,788, ఇతరులు 16మంది ఉన్నారు. అలాగే సిర్పూరు నియోజకవర్గం పరిధిలో మొత్తం 2,29,101మంది ఓటర్లు వారి భవిష్యత్తును నిర్ణయించబోతున్నారు. ఇందులో 1,14,567మంది మహిళలు, 1,14,522 మంది పురుషులు, 12మంది ఇతర ఓటర్లు ఉన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదు..
జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఎన్నికల విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆదివారం కాగజ్‌నగర డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల అధికారులు ఈవీఎంలను చెక్ చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. దూరప్రాంతాల్లోని కేంద్రాలకు సిబ్బంది సామగ్రితో వెంటనే బయలు దేరాలని ఆదేశించారు. ఎన్నికల విధులు నిర్వహించేందుకు బయలుదేరుతున్న సిబ్బందిని స్వయంగా కలెక్టర దగ్గరుండి పంపించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో సురేష్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రమోద్, తహసీల్దార్ కిరణ్ సిబ్బంది ఉన్నారు.

శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి..: ఎస్పీ సురేష్ కుమార్

ఎన్నికలు ప్రశాంతవాతావరణంలో నిర్వహించాలని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందితో ఆయన మాట్లాడారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తేవాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాలని సూచనలు, సలహాలను సిబ్బందికి వివరించారు. ఆయనవెంట డీఎస్పీ కరుణాకర్, సీఐ శంకరయ్య తదితరులున్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే


పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్తున్న సిబ్బంది


కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేష దోత్రే


ఆసిఫాబాద్ నుంచి వాహనాల్లో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

ఘనంగా నర్సింగ్ డే


ఆసిఫాబాద్‌లో నర్సింగ్ డేలో పాల్గొన్న నర్సులు

ఆసిఫాబాద్, మే 12: ఆసిఫాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం నర్సింగ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వెరోనిక, హెడ్ నర్సు సుప్రజ, కుసుమ, కవిత, సునీత, స్రవంతి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో..

మంచిర్యాల కలెక్టరేట్: మంచిర్యాలజిల్లాకేంద్రంలోని బర్త్‌రూట్ ఆసుప త్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి వైద్యురాలు శృతిగోలి కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో నర్సులు పాల్గొన్నారు.

స్నేహితుడికి చేయూత

మందమర్రిటౌన్, మే 12: పట్టణంలోని యాపల్ ప్రాంతానికి చెందిన ఇటికాల మల్లేష్ పక్షవాతం వచ్చి మంచానికే పరిమితయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న అతని స్నేహితులు సుందిళ్ల రాజయ్య, సిరిపురం మల్లయ్య, సమ్మిరెడ్డి, భాషా, చిలుముల శ్రీనివాస్, చందర్ ఆదివారం మల్లేష్‌ను పరామర్శించారు. మల్లేష్ ఇటు ఇటు వెళ్లేందుకు వీలుండే రూ.15వేల విలువగలవీల్‌చైర్‌ను అందజేశారు. అలాగే కుటుంబ పోషణకు రూ.5వేల ఆర్థికసహాయం అందించారు. ఆర్థికసహాయం చేసిన స్నేహితులను కాలనీ వాసులు అభినందించారు.



ఎన్నికల డ్యూటీలను ప్లేడేలుగా పరిగణించాలి

శ్రీరాంపూర్, మే 12: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఈనెల 10నుంచి 13వతేదీ వరకు సెక్యూరిటీ సిబ్బందిచేసే డ్యూటీలను ప్లేడేలుగా పరిగణించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు గుల్ల బాలాజీ, అంబాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిసారి ఎన్నికల సందర్భంగా వారితో పనిచేయించుకొని ప్లేడేలు ఇవ్వడం లేదన్నారు. ఆన్‌డ్యూటీగా పరిగణించకుండా కేవలం స్పెషల్‌లీవ్‌గా అమలు చేయడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. పైగా 8 గంటల డ్యూటీకి బదులు వేరే ప్రాంతంలో పనిచేయడం వలన 24గంటలు అక్కడే ఉండాల్సి వస్తోందన్నారు. వేతనం మాత్రమే చెల్లిస్తున్నట్లు తెలిపారు. టీఏ, డీఏలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు కలుగజేయడం లేదన్నారు. వెంటనే ఆన్‌డ్యూటీగా పరిగణిస్తూ ప్లేడేలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని, లేనిపక్షంలో తమ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పోలింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే


ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, మే 12: లోక్‌సభ ఎన్నికలలో భాగంగా సోమవారం జరగనున్న పోలింగ్ కార్యక్రమానికి సంబంధించి ప్రతిఅంశంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లాఎన్నికల అధి కారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆది వారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో పోలింగ్ నమోదు, సమాచారాన్ని సేకరించి ఆన్ లైన్‌లో నమోదు చేసే ప్రక్రియపై కంప్యూటర్ ఆపరేటర్లు, అధికా రులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కార్యక్రమంలో ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ శాతాన్ని సెక్టార్ అధి కారుల వద్ద నుంచి ప్రతి రెండు గంటలకు నమోదైన ఓటర్ల వివరాలు సేకరించాలన్నారు. నియోజకవర్గానికి ఒక జిల్లాస్థాయి అధికారి పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒక ఆపరే టర్ 3/4సెక్టార్ అధికారుల నుంచి పోలింగ్ శాతాన్ని సేకరించాలన్నారు.

పోలింగ్ రోజు ఉదయం 9నుంచి 11 గంటలకు, మధ్యాహ్నం 1నుంచి 3గంటలకు, 4గంటలకు వివరాలు సేకరించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఇన్ చార్జిలుగా వ్యవహరించే జిల్లాస్థాయి అధికారులు ఈప్రక్రియను పర్యవే క్షించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య అధికారి అనీల్‌కుమార్, జిల్లా ఆడిట్ అధికారి, ఎన్నికల విభాగం తహసీల్దార్ మధుకర్, ఈ-డిస్ట్రిక్ మేనేజర్ గౌతంరాజ్, నాయబ్ తహసీల్దార్ జితేందర్, ఎస్‌ఐసీ ఇన్‌చార్జి శ్రీకాంత్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ


ఆసిఫాబాద్ బస్టాండ్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ఆసిఫాబాద్, మే 12: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రయాణికులకు సరిపడ బస్సులు లేకపోవడంతో దూరప్రాంతాలకువెళ్లే ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో బస్సుల కోసం ప్రయా ణికులు గంటల తరబడి వేచి చూశారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆర్టీసీ బస్సులన్నీ పోలింగ్ సిబ్బందిని తరలించేం దుకు ఉపయోగించారు. దీంతో కొన్ని బస్సులు మాత్రమే షెడ్యూల్ ప్రకారం నడవగా అవి సరిపోకపోవడంతో ప్రయాణి కులు ఇబ్బందులుపడ్డారు.

పోలింగ్‌కు కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

సిర్పూర్(టి)/చింతలమానేపల్లి/పెంచికలపేట/బెజ్జూరు/కెరమెరి/సిర్పూర్(యు)/దహెగాం, మే 12: మండలాల్లోని పోలింగ్‌కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది చేరుకున్నారు. కొన్ని మండలాల్లో ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సిర్పూర్(టి) మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రం-123ని మోడల్ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్‌కేంద్రాన్ని ఆదివారం జిల్లానోడల్ అధికారి భిక్షపతిగౌడ్, ఏఎస్పీఅధికారులు సందర్శించారు. అలాగే మండలంలోని 29పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ నిర్వహణకు సిబ్బంది సామగ్రితో చేరుకున్నారు.

చింతలమానేపల్లి మండలంలో మొత్తం 33 పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో ఒకటి బాలాజీ అనుకోడ గ్రామంలోని మోడల్ పోలింగ్ కేంద్రంను ఏర్పాటుచేసినట్లు అధికారులు వెల్లడించారు. బాలాజీ అనుకోడలో మహిళా నిర్వహక పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేశారు. పోలింగ్ కేంద్రాలను డీపీవో భిక్షపతిగౌడ్, డీఎల్‌పీవో సురేష్ సందర్శించారు.

పెంచికలపేట మండలంలోని 19పోలింగ్ స్టేషన్లలుండగా ప్రజాఅవసరాల కోసం మరో రెండు పోలింగ్ స్టేషన్లను జైహింద్‌పూర్, నందిగాం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని అన్ని పోలింగ్‌కేంద్రాలను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

బెజ్జూరు మండలంలో మొత్తం 38పోలింగ్ కేంద్రాలు ఉండగా ఒక్కోకేంద్రానికి నలుగురు సిబ్బంది, ఆరురూట్లలో ఆరుగురు రూట్ అధికారులను నియమించారు. మండలంలో 23,884మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ భూమేశ్వర్ పేర్కొన్నారు.

కెరమెరి మండలంలో గతంలో 30 పోలింగ్ కేంద్రాలు ఉండగా అధికారులు వాటిని 41కి పెంచారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి అయిదుగురు ఎన్నికల సిబ్బందిని నియమించారు.

సిర్పూర్(యు) మండలంలో ఆదివారం సాయంత్రం ఆయా పోలింగ్‌కేంద్రాలకు ఎన్నికల సిబ్బందికి చేరుకున్నారు. మండలంలో మొత్తం 23పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

దహెగాం మండలంలో సోమవారం నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల కోసం అధికారులు పోలింగ్ కేంద్రాల సిబ్బందిని ఈవీఎంలను తరలించారు. మండలంలోని ఇట్యాల 254పోలింగ్ కేంద్రాన్ని మోడల్ పోలింగ్ స్టేషన్‌గా ఎంపిక చేసిన అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండలంలో మొత్తం 26078 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. గతంలో 30 పోలింగ్ కేంద్రాలు ఉండగా అధికారులు వాటిని 41కి పెంచారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి అయిదుగురు ఎన్నికల సిబ్బందిని వినియోగించుకోనున్నారు.


చింతలమానేపల్లిలో మహిళా నిర్వాహక పోలింగ్ కేంద్రం


చింతలమానేపల్లిలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం


సిర్పూర్(టి)లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం